కథ

# పెళ్ళికూతురు మారింది!

మేడా మస్తాన్‌రెడ్డి

**'అతిథి' ఫంక్షన్ హాలు పెళ్ళికొచ్చిన బంధుమిత్రులతో కళకళలాడుతూ కోలాహలంగా ఉంది. ముహూర్తం సమీపిస్తున్నా పెళ్ళికూతురిని తీసుకుని ఇంకా రాలేదేమిటా...అని పెళ్ళికొడుకు గిరి అసహనంతో మెడలోని గులాబీ దండను మాటిమాటికీ సవరించుకుంటున్నాడు. పురోహితుడు చెప్పే మంత్రాలు అర్థంకాకపోయినా వాటిని వల్లెవేస్తూ పెళ్ళికుమార్తె రాక కోసం ప్రధానద్వారం కేసి చూస్తూ ఉన్నాడు.**

వేదికకు ఓ వైపు సన్నాయిమేళం వాళ్ళు పాత 'సీతారామకళ్యాణం' సినిమాలోని పెళ్ళిపాటను వీనులవిందుగా లయబద్ధంగా వినిపిస్తున్నారు. సరిగ్గా అప్పుడే బయట నుండి బ్యాండుమేళం వినిపించింది గిరికి.

'హమ్మయ్య!..పెళ్ళికూతురి కారు వచ్చేసినట్లుంది' అనుకుంటూ వాకిలి కేసి చూసాడు. వీడియో లైటు కాంతిలో, చేతిలో కలశంతో తళతళా మెరిసిపోతూ పుత్తడి బొమ్మలా ఉన్న నవవధువును హాలు లోపలికి తీసుకొస్తున్నారు. ఆమెకేసి ఆతృతగా చూసిన గిరి, ఆ వెంటనే అనుమానంగా చూసాడు. మంత్రాలు పలకడం ఆపి కళ్లు చిట్లించి బాగా పరికించి మరీ చూసాడు. "ఈ హాలులో మరో పెళ్ళి ఏదయినా ఉందా?" అని పురోహితుడి చెవిలో గొణిగాడు.

"లేదు నాయనా! ఈ ముహూర్తానికి మీదొక్కటే వివాహం. ఆ వచ్చే ఆవిడే కాసేపట్లో మీకు కాబోయే మీ ఆవిడ" మంత్రాలు ఆపి తడుముకోకుండా బదులిచ్చాడు పురోహితుడు.

వధువును వరుని ఎడమవైపు పీటపై కూర్చోపెట్టారు. గిరి ఈసారి పరీక్షగా, జాగ్రత్తగా ఆమెకేసి చూసాడు. అంతే..పీట కింద బాంబు పేలినట్లుగా మూడు అడుగులు ఎగిరి "మోసం" అని అరుస్తూ ఓ మూల కట్టిన అరటిబోదె మీద పడ్డాడు. కనురెప్ప పాటులో లేచి, "మోసం, దగా, అన్యాయం, అక్రమం, చీటింగ్ హరామీ" అంటూ తనకు తెలిసిన భాషల్లో అరుస్తూ, "పెళ్ళికూతురు మారింది" అంటూ వేదిక దిగిపోయాడు.

బ్యాండుమేళం, మంగళవాయిద్యాలు ఆగిపోయాయి.

భోజనాల బల్లల వద్దనున్న గిరి తల్లిదండ్రులు అంజనమ్మ, అప్పలకొండ, వధువు తల్లిదండ్రులు జాంబవతి కృష్ణారావులు పరుగులతో వచ్చి చేరారు. పురోహితుడు బిక్కమొహంలో తన సంచీ సర్దుకునే ప్రయత్నంలో ఉన్నాడు. సొమ్మసిల్లిన పెళ్ళికూతురి మొఖంపై నీళ్ళు చిలకరించకుండా విసనకర్రతో విసురుతూ ఆమెను లేపే ప్రయత్నంలో కొందరు హైరానాపడుతున్నారు. ఎవరు, ఎవరిని, ఎప్పుడు, ఎందుకు ఎలా మోసం చేసారో, పెళ్ళిపీటల మీద పెళ్ళి కూతురు హఠాత్తుగా ఎందుకు మారిందో తెలుసుకునేందుకు షామియానాలో ఉన్న జనం ఆరాటపడుతూ కళ్యాణమంటపం వద్దకు చేరుకున్నారు.

"ఏం జరిగింది, గిరి?" ఆందోళనగా అడిగాడు అప్పలకొండ.

"ఇంకాసేపుంటే జరగరాని కుట్ర జరిగిపోయేది నాన్నా! పెళ్ళికూతుర్ని మార్చేసారు" అంటూ నోరూ నుదురు కొట్టుకున్నాడు గిరి.

"అయితే పెళ్ళి రద్దుచేస్తున్నాం. మగపెళ్ళివారంతా బయలుదేరండి" ఆదేశించాడు అప్పలకొండ. అంజనమ్మ కొంగుతో కళ్లు ఒత్తుకుంది. "మరి మాకు భోజనాలో" అడిగారు మగపెళ్ళివారు.

"కొంచెం వివరంగా చెప్పు బాబూ" ఆడపెళ్ళి వారెవరో అడిగారు.

"ఇంకా చెప్పేదేమిటండీ! నాకు పెళ్ళిచూపుల్లో చూపించిన అమ్మాయి, ఈమె ఒకటి కాదు" అలిగాడు పెళ్ళికొడుకు.

"అయితే పెళ్ళి రద్దు చేస్తున్నాం. మనవాళ్ళంతా బయలుదేరండి" మళ్ళీ ఆదేశించాడు అప్పలకొండ. అంజనమ్మ మళ్ళీ కొంగుతో కళ్లు ఒత్తుకుంది. "మరి మా భోజనాలో.." మరోసారి అడిగారు మగపెళ్ళివారు.

వధువుతండ్రి కృష్ణారావుకి కూడా అనుమానం కలిగినట్లుంది. వేగంగా వెళ్ళి అప్పుడే స్పృహలోంచి లేచి కూర్చుంటున్న అమ్మాయిని దగ్గరగా చూసి, "అల్లుడుగారూ ఈ అమ్మాయి మా అమ్మాయే" అంటూ ఆనందంగా అరిచాడు.

"అయివుండవచ్చు. మీ రెండో అమ్మాయో, నాలుగో కూతురో అయివుండవచ్చు. నేను చూసి ఇష్టపడి మనసుపడ్డ 'సుందరి' మాత్రం కాదు. హన్నా...ఒక కూతురిని పెళ్ళిచూపుల్లో చూపించి మరో కూతురితో పెళ్ళి జరిపిస్తారా?" ఇంకా బిగుసుకున్నాడు గిరి.

అప్పలకొండ అదే మాట. అంజనమ్మది అదే చర్య. మగపెళ్ళివారిది అదే వరస.

"మీరు కాస్త శాంతించండి బావగారూ" అంటూ సుందరి తండ్రి కృష్ణారావు "ఇదిగోనండీ మా రెండో అమ్మాయి సునంద. ఇది పుట్టాకే, ఇక కలగబోయేది ఆడ సంతానమేనని నిర్ధారించుకుని ఆపరేషన్ కూడా చేయించుకున్నాం. మాకు మరో అమ్మాయికి అవకాశమేలేదు" ఇక మాట రాక కన్నీళ్ళు పెట్టుకున్నాడు. జాంబవతి శృతి కలిపింది.

అదే క్షణంలో ఈ సంబంధం కుదిర్చిన పెళ్ళిళ్ళ పేరయ్య ఎక్కడనుండో పరుగుతో వచ్చి ప్రత్యక్షమయ్యాడు. జరిగిన అనర్థానికి చింతించాడు. కృష్ణారావు జాంబవతిలను ఒక పక్కకి పిలిచి చెవిలో గుసగుసలాడాడు. వాళ్ళు పెళ్ళికూతురిని తీసుకొని నిష్క్రమించారు. ఆ వెంటనే చేతులు జోడించి, "అయ్యా గిరిబాబూ. చిన్న పొరపాటు జరిగిపోయింది. క్షమించాలి. నేను రావడం ఆలస్యం అయింది. మన్నించాలి. మీరు కోరుకున్న 'సుందరి'తోనే మీ పెళ్ళి నిక్షేపంగా జరుగుతుంది. కాకపోతే, ఈ ముహూర్తం దాటిపోయింది కాబట్టి ఈరోజు మధ్యాహ్నం మూడుగంటల ముహూర్తంలో జరిపిస్తాం. ఈ పక్కనే ఉన్న లాడ్జిలో ఎ.సి.రూమ్ బుక్ చేయించాం. వెళ్ళిరండి" అని వాళ్ళను పంపి, జనం వైపు తిరిగి "మిత్రులారా! ముహూర్తం వాయిదా పడినందుకు బాధగా ఉంది. ఇప్పుడు మీకు భోజనాలుంటాయి. మరల మూడుగంటలకు కాఫీ టిఫిన్లతో పాటు కూల్ డ్రింక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. కాసేపు కునుకు తీయడానికి చాపలూ జంబుఖానాలు వేయిస్తున్నాం. దయచేసి సహకరించండి" అని రాజకీయనాయకుడిలా ఉపన్యాసం ఇచ్చి ఓ కుర్చీలో కూలబడ్డాడు.

పెళ్ళిపెద్దలు పదిమంది కుతూహలంతో ఆయన చుట్టూ చేరి జరిగిందేమిటో చెప్పమని బలవంతపెట్టారు.

పెళ్ళిళ్ళ పేరయ్య ఒక చిన్న నిట్టూర్పు విడిచి, "ఈరోజు జరిగింది చెప్పేముందు ఇంతకుముందు జరిగిన కథను మీకు చెప్పాలి" అంటూ పోతనామాత్యుని శైలిలో తను విన్నది కొంత కన్నదికొంత కూడా జోడించి మొదలుపెట్టాడు.

* * *

గిరికి ఊహ తెలిసిన తర్వాత తన అమ్మమ్మ నోటి వెంట

విన్న మొదటి మాట, కంటితో చూసిన మొదటి చిరు ప్రాణి 'కాకి'. అన్నం తినక మారాం చేస్తూ ఉంటే, అదిగో కాకి, ఉష్..కాకి, కాకెత్తుకెళ్ళింది, కాకి ముద్ద..ఇలా ఒక్కో గోరుముద్దకు ఒక 'కాకి' మాటను చేర్చి కాకులను చూపిస్తూ డాబాపై అటూ ఇటూ తిరుగుతూ చంకన ఉన్న గిరికి కడుపునింపేది గిరి అమ్మమ్మ అనిరమ్మ. మొదట విడ్డూరంగా, భయంకరంగా కనబడ్డ కాకి రూపం తర్వాత నిదానంగా గిరికి అలవాటయిపో యింది. నడక వచ్చాక ఒక్కడే డాబాపైకి వెళ్ళి చేతిలోని తినుబండారాన్ని విసరడం, దూరాన ఏ



చింత చెట్టుమీదనో, ఏ బాదం చెట్టుమీదనో ఉన్న ఒకటో రెండో కాకులు ఎగురుకుంటూ రావడం, ఆ వస్తువును నోట కరుచుకుని వెళ్ళడం జరిగేది. ఇంకాస్త పెద్దయ్యాక టిఫిన్ తింటూ మేడమీదకెళ్ళి సగం తాను తిని మిగి లింది కాకులకు వేయడం, అవి 'కావు' 'కావు' మంటూ వాలి నడుము ఊపుకుంటూ తినడం చూసి గిరి సంబర పడేవాడు. కాకులను ఎవరైనా తిట్టినా, రాళ్ళతో కొట్టినా సహించేవాడు కాదు. వంకరగా వంగి ఉండే రామచిలుక ముక్కు కంటే చక్కగా నిటారుగా ఉండే కాకి ముక్కు అంటేనే గిరికి ప్రీతి. కాకిమీద ప్రేమతోపాటు వాటి రంగు మీద కూడా మమకారం పెంచుకుంటూ వచ్చాడు. తనకు తెలియకుండానే నలుపురంగును ప్రేమించడం మొదలుపెట్టాడు. క్రమంగా నలుపుని, ఆపైన నల్లగా ఉండేవారిని ఆరాధించడం మొదలయ్యింది.

అమ్మ అంజనమ్మను కూడా కూరల్లో నల్లగా ఉండే పాత చింతపండునే వాడమని పట్టుపట్టాడు. అయిదో క్లాసు అయ్యాక పట్నం చదువు కావడంతో కాకిస్నేహం తప్పినా కాకినలుపు అంటే మక్కువ ఎక్కువయింది. గిరి ఇస్త్రీ బట్టలు పెట్టుకునే ట్రంకు పెట్టె, చలికాలం కప్పుకునే కంబళి, ఇంట్లో పాకే కుక్క అన్నీ నలుపే. క్లాస్ రూమ్‌లో టీచర్ వెళ్ళిన వెంటనే బ్లాక్ బోర్డు పై రాసిన తెల్లని చాక్‌పీసు గీతలను చెరిపి పూర్తి నలుపును తనివితీరా చూస్తూ, మరో టీచర్ వచ్చేంతవ రకు తన్మయత్వం చెందేవాడు. గేదెలంటే ఎంతో ఇష్టం ఉన్నా పేదరంగులో తేడా లేదు కాబట్టి ఆవులంటే అయి

ష్టతను పెంచుకోలేదు గిరి. కాకి పిండం ముట్టుకుంటేనే గతించిన పితరులు పుణ్యలోకానికి వెళతారని తెలిసినా, ఎంగిలి చేత్తే కూడా కాకిని తోలని వాళ్ళని చూస్తే గిరికి మాచెడ్డ చిరాకు. వాటిని అసహ్యించుకునే వాళ్ళంటే పరమ అసహ్యం కూడా.

కాలేజీకొచ్చి తనకంటూ ఓ గది ఏర్పడ్డాక గోడపై రెండు కాకుల ఫోటో ఒకటి కట్టించి పెట్టించాడు. ఇంకా తనివితీర కిటికీలకు తలుపులకు నల్లరంగు వేయించాడు. కుర్చీబల్ల, మంచం అన్నీ నల్లటేకుతో చేయించుకున్నాడు. ఇంతెందుకు ఇంట్లో ఫ్రిజ్, టెలిఫోను, నడిపించే బుల్లెట్ బైకు, వాడే పెన్ను దాన్లో ఇంకు అంతా నలుపే. నల్ల ఇంకు వాడవద్దన్న కారణంగా కాలేజీ మారాడేగానీ తన విలువలకు నీళ్ళొదల్లేదు.

కాలేజీ కవితల పోటీలో గిరి రాసిన ఈ కవిత సంచలనం సృష్టించింది.

'నలుపే అతి వలపు<br>
తెలుపు దాని ముందు దిగ దుడుపు<br>
కొండలు నలుపు<br>
కాటుక నలుపు<br>
కన్నులు నలుపు<br>
కడలి నలుపు<br>
కురులు నలుపు<br>
చీకటి నలుపు<br>
ఏనుగు నలుపు<br>
కాకి నలుపు<br>
కంటికి కనబడే ప్రతీ వస్తువూ నలుపు'

చివరి పంక్తి ద్వంద్వార్థాన్ని కలిగినట్లుందని మహిళా లెక్చరర్లు నిరసన తెలిపినా న్యాయనిర్ణేతలు గిరికి కంటి తుడుపు బహుమతినిచ్చి ప్రోత్సహించారు. చదువయ్యాక ఉద్యోగం కూడా టైర్ల కంపెనీలో సంపాదించాడు. ఇక ఎంచుకోవాల్సింది జీవిత భాగస్వామినే.

"మా అమ్మాయి అపరంజి బొమ్మండీ"

"మా పిల్ల పసిడిమొగ్గండీ" అంటూ పెళ్ళి సంబంధాలు రావడమూ, వెళ్ళి చూసి వచ్చి వద్దని పెదవి విరిచి అక్కడే తేల్చి చెప్పడమూ ఇలా ఎన్నో జరిగాయి. విసిగి వేసారిన అప్పలకొండ అంజనమ్మలు నిలదీసి అడిగాక మనసులోని అసలు విషయం చెప్పాడు గిరి. అది విని పాపం, వాళ్ళు అవాక్కయి నోరు తెరుచుకుని ఉండిపోయారు.

'నాదీ ఆడజన్మే', 'ఊర్వశి' సినిమాల్లోని సావిత్రి, శారదలాంటి మేనిరంగుగల ఆడవారినే పెళ్ళి చేసుకుంటానని భీష్మించుకుని కూర్చున్నాడు గిరి.

గిరి మద్రాసు మేనత్త వర్ధనమ్మ ఆరు నెలలకోమారు పుట్టింటి కొచ్చినపుడల్లా, "మా అల్లుడికి పెళ్ళాంగా 'నల్లపిల్ల'దాన్ దొరుకును" అని ఆశీర్వదిస్తూ ఉండేది. (నల్ల అంటే మంచి అని తమిళ అర్థం) ఆ ప్రభావం కూడా గిరిపై ఎక్కువ పడింది.

ఇంకేముంది. చేసేదేమీ లేక ఆ ప్రకారమే వేట మొదలయ్యింది. చూపించిన ఎన్నో చామనఛాయ సంబంధాలు గిరికి నచ్చడం లేదు. ఇక మన రాష్ట్రంలో గిరికి నచ్చేవారు లేరనీ, తమిళనాడులో ప్రయత్నం చేద్దామనుకునేంతలో వచ్చింది కాకినాడ మండలంలోని కాకి కృష్ణారావు జాంబవతిల జ్యేష్ఠపుత్రిక 'సుందరి' సంబంధం.

పొన్నూరులో కృష్ణారావు ఇంట్లో ఏర్పాటు చేసిన పెళ్ళి చూపులకి నల్లటి చిన్నకారులో అయినవాళ్ళంతా బయలుదేరి వెళ్ళారు. వెలుతురుగానే ఉన్నా హాలులో ట్యూబ్ లైటు కూడా వేసి ఉంచారు. అల్పాహారం పూర్తయింది. "అమ్మాయిని తీసుకురండి" అని అరచారెవరో. ఆ వెంటనే కృష్ణారావు రెండో కుమార్తె కాబోలు కాఫీలు అందరికీ అందించి గిరిని ఓరకంటితో చూసి లోపలికెళ్ళింది. కాఫీలు తాగడం పూర్తయ్యాక చాపమీద కూర్చున్న వాళ్ళందరూ లేచి లోపలికి వెళ్ళారు.

"మా సుందరి నచ్చిందా అల్లుడుగారూ" కృష్ణారావు ఆప్యాయంగా అడిగాడు.

"ఏదీ చూడందే" నసిగాడు గిరి.

"మళ్ళీ పిలిపించమంటారా"

"మళ్ళీ అంటున్నారు. ఒకసారి వచ్చి వెళ్ళిందా"

"మీ కళ్ళముందే చాపమీద కూర్చుని ఇప్పుడే లోపలకు వెళ్ళింది కదా బాబూ. పక్కనే మీ అత్తగారూ తన స్నేహితురాళ్ళూ కూడా ఉన్నారాయె!"

"అలాగా" అంటూ గిరి తలపంకించి కాలాన్ని కాస్త వెనక్కి లాగాడు. ఆ...అవును. ఆ ఆడాళ్ళ గుంపులో మల్లెపూలు గాలిలో తేలుతూ కనిపించాయి. నెమలిపింఛం రంగు చీరా, అదే రంగు రవికా కనబడ్డాయి. మధ్యలో నెక్లెస్, గాజులు, వడ్డాణం, ముక్కుపుడక వాటి వాటి స్థానాల్లో అగుపించాయి.

చిన్న స్పార్కులో లాంటి మెరుపు కూడా మెరిసింది. అది సుందరి నవ్వే అయితే...అయితే, ఆకారం కనబడకుండా అలంకారాలు కనిపించాయంటే... అంటే...అంటే..."

"ఎన్..న్స..న్" పెద్దగా కేక పెట్టాడు గిరి.

వెంటనే సుందరితో మాట్లాడాలని మొండికేసాడు. పల్లెటూరి సంప్రదాయానికి విరుద్ధమైనా, విడ్డూరమేమీ కాదనీ, వచ్చిన సంబంధం పుచ్చిపోతే, ముదిరిపోతున్న రెండో కుమార్తె ఇంట్లోనే నిలిచిపోతుందనీ పెరట్లో సన్నజాజి పందిరికింద రెండు కుర్చీలు వేసారు. అక్కడ కూర్చున్న గిరి సుందరితో మాట్లాడింది. ఒకటే మాట. మిగిలిన సమయం అంతా ఆమె సౌందర్యాన్ని ఆస్వాదించడంతోనే సరిపోయింది. గిరికి జీవితాశయం నెరవేరబోతుందని తట్టుకోలేని ఆనందంగా ఉంది. సుందరి వంశం కూడా 'కాకివారు' కావడం అదృష్టంగా భావించాడు. తెలిసినా, "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"సుందరి" తలవొంచే సమాధానం ఇచ్చింది.

'అయ్యో! గొంతు కోకిలలా ఉందేమిటి..కర్మ' అని కూసింత బాధపడ్డా, అది కూడా కాకిలా ఉంటుంది కదా అని సమాధానపడి, సముదాయించుకుని 'ఓ.కే.' చేసాడు గిరి. అప్పటికప్పుడు నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకోవడం జరిగింది. పొన్నూరు పూజారి మూఢంలో ముహూర్తాలు లేవంటున్నా, బలవంతపు పెట్టుడు ముహూర్తం పెట్టించాడు గిరి. సుందరి తల్లిదండ్రులకు అల్లుడు దివినుండి భువికి దిగివచ్చిన గిరిధారిలా కనిపించాడు.

* * *

పెళ్ళిళ్ళ పేరయ్య చెప్పడం ఆపి గొంతు సవరించుకుని నీళ్ళు తాగి, "ఇంత ఇష్టపడ్డ గిరి ఇప్పుడెందుకిలా ప్రవర్తించాడని మీరు మరీ బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచించనక్కర్లేదు.

విషయమేమిటంటే, గిరి ఫ్లాష్‌బ్యాక్ తెలియని ఆడపెళ్ళివారు నేటి తెల్లవారుఝామున రెండు గంటలనుండీ మొదలుపెట్టి అర అంగుళం మందాన గులాబీరంగు మేకప్‌తో సుందరిని సింగారించి తీసుకురావడమే వారు చేసిన తప్పు. దీనికి ప్రాయశ్చిత్తంగా నీటి కొరత అయినా టాంకరుతో నీరు తెప్పించి సుందరికి ఆయిల్ బాత్ చేయిస్తున్నారు. కాసేపు హాయిగా విశ్రాంతి తీసుకోండి. కథ సుఖాంతం అవుతుంది" అని పెద్దగా ఆవులించి ముందు కుర్చీలో కాళ్ళు చాపి కళ్ళు మూసుకున్నాడు పెళ్ళిళ్ళ పేరయ్య.

* * *

మధ్యాహ్నం మూడు గంటలకు 'అతిథి' ఫంక్షన్ హాలు పెళ్ళికొచ్చిన బంధుమిత్రులతో మళ్ళీ కళకళలాడుతూ కోలాహలంగా ఉంది. సుందరిని తీసుకొచ్చి కూర్చోపెట్టారు.

పెళ్ళికూతురు మారలేదు. మారింది అమె ముస్తాబు మాత్రమేనని నిర్ధారించుకున్న గిరి సుందరికేసి అనురాగంతో చూసాడు. సిగ్గు తెరలతో కనులు దించుకుని తలను వొంచుకున్న గులాబీరంగు లేని సుందరి మెడలో, మాంగల్య తంతునానేనా..అంటూ పురోహితుడు మంత్రాలు చదువుతుండగా, బంగారపు తాళిబొట్టు గర్వంగా కట్టాడు గిరి.

